క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సబ్‌స్టేషన్ పరిధి గుల్లేపల్లి, మల్లునాయుడపాలెం, మొగలిపురం, బోదువలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపుర అగ్రహారం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అద్దూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులంతా తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

నేడు మెగా పీటీఎం

సబ్బవరం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

భక్తులకు క్లాత్, జ్యూట్ బ్యాగుల పంపిణీ



గిరిప్రదక్షిణ భక్తులకు జూట్, క్లాత్ బ్యాగులు అందిస్తున్న బొర్రమాంబ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో సింహాచలేశుడి గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణంపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా క్లాత్, జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో పారాయణ సేవా సమితి ప్రతినిధులు దారిపొడువునా భక్తులకు పంచారు.

వానరం హల్ చల్



అగనంపూడి: దువ్వాడ కాలనీలో వానరం ఇళ్లల్లోకి, మేడల మీద హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వానరాన్ని పట్టుకొని జూకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



గేటు మీటింగ్‌లో సీఈ యూనియన్ నాయకులు

గోపాలపట్నం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నేవల్ సిస్టమ్స్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. పలు డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. కొత్త పింఛన్‌ను రద్దు చేసి పాతపింఛన్ అమలు చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వంద శాతం కారుణ్య నియామకాలు జరపాలని, ఉద్యోగులకు అనుకూలంగా ఇచ్చిన కోర్టు తీర్పులను అమలు చేయాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యాజమన్యానికి అందించారు. కార్యక్రమంలో సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి గౌరవ్ కె. ప్రజాపతి, అధ్యక్షుడు ఆకిరి సునీల్, ఉపాధ్యక్షుడు హరిరామ్‌జత్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోపాలపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ బుధవారం ఎన్ఏడీ మెయిన్ గేటు ఎదుట ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎన్ఏడీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని, లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భక్తుల సేవలో.. స్వచ్ఛంద సంస్థలు

- దారి పొడవునా ఆహార పదార్థాలు, శీతల పానీయాల వితరణ
- సేవలందించేందుకు పోటీపడ్డ ఎన్జీవోలు, యువత, స్థానికులు

మానవసేవే.. మాధవ సేవ. దీన్ని ఆచరించి చూపడంలో సింహగిరి పరిసర ప్రాంతాల ప్రజలు ఎప్పుడూ ముందంజలోనే ఉంటారు. ఎక్కడెక్కడి నుంచే భక్తులు సింహాచలేశుడి కృపకు పాత్రులయ్యేందుకు గిరిప్రదక్షిణకు తరలివస్తే.. వారికి అవసరమైన ఆహార పదార్థాలు, శీతల పానీయాలు, స్నాక్స్ అందించడంతోపాటు, అలసిన పాదాలకు మర్దన చేస్తూ నగరవాసులు పరోక్షంగా స్వామి సేవలో పునీతులయ్యారు. సింహాచలం గిరిప్రదక్షిణలో ప్రభుత్వం, దేవస్థాన యంత్రాంగం అందించిన వసతులతో పోల్చితే స్థానికులు, స్వచ్ఛంద సంస్థల సేవలు వందల రెట్లు మేలంటూ భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



బాలాజీనగర్ ఈస్ట్‌పాయింట్ కాలనీ-3లో భక్తులకు ఉప్మా, కేసరి పంపిణీలో నివాసితులు



అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు మందులు అందిస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు పాత అడవివరం నుంచి పైనాపిల్‌కాలనీ వరకు దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, పలువురు వ్యక్తిగతంగాను భక్తుల సేవలో తరించారు. ఆహార పదార్థాలు, పానీయాలు, ప్రసాదం, టిఫిన్స్, చాక్లెట్లు, టీ, కాఫీ, బిస్కెట్లు తదితర వాటిని విరివిగా అందించారు.

- పాత గోశాల వద్ద ఎస్ఎన్ఆర్ కల్యాణమండపం అధినేత బి.వి.కష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు పొంగలి, మైసూర్ బొండా, ఉప్మా నిర్విరామంగా అందించారు.
- పైనాపిల్ కాలనీ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన కందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాత్రి వరకు పూరీ టిఫిన్‌గా అందించారు. ఇందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా 50 మంది వంట బృందాన్ని రప్పించారు.
- పైనాపిల్ కాలనీ వద్ద శ్రీ గురురాఘవేంద్ర సంపత్ వినాయక ఏజెన్సీస్ ఆధ్వర్యంలో భక్తులకు బిర్యానీ, ఉప్మా, శనగలు పంపిణీ చేశారు.
- అడవివరంలోని గాంధీనగర్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు, కర్రిస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధినేత కర్రి అప్పలస్వామి భక్తులకు ఎనర్జీ డ్రింక్‌లను అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్టా శ్రీను, లండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- బాలాజీనగర్‌లో ఈస్ట్‌పాయింట్ కాలనీ-3 నివాసితులు స్వచ్ఛందంగా భక్తులకు ఉప్మా, కేసరి లను పెద్ద ఎత్తున అందజేశారు.
- వేపగుంట నుంచి పాత గోశాల వెళ్లే సింహపురి లేఅవుట్ ఆర్చ్ వద్ద సుజాతనగర్‌కు చెందిన పలువురు యువకులు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.
- పాత గోశాల వద్ద పెట్రోల్ బంక్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, ప్రసాదం అందించారు.
- దారపాలెం సమీపంలో బీఆర్‌టీఎస్ రోడ్డులో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు.
- పాత అడవివరం సమీపంలో గురుకుల పాఠశాల వద్ద కొత్తవలసకు చెందిన దుర్గాదేవి గుడి సంఘం భక్తులకు టీ, బిస్కెట్లు అందించారు.
- దారపాలెం వద్ద రైతుమిత్ర, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో బిర్యానీ పంచిపెట్టారు.
- పాత అడవివరం నుంచి పాత గోశాల వరకు భక్తులకు జీవీఎంసీ పలు స్టాళ్లు ఏర్పాటు చేసి, మంచినీరు అందుబాటులో ఉంచింది.



అడవివరం గాంధీనగర్‌లో భక్తులకు ఎనర్జీ డ్రింక్స్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కర్రి అప్పలస్వామి



పైనాపిల్‌కాలనీ వద్ద భక్తులకు పూరీ అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కందాళ శ్రీనివాస్



రాఘవేంద్ర సంపత్ వినాయక ఏజెన్సీస్ ఆధ్వర్యంలో భక్తులకు బిర్యానీ పంపిణీ



పాత గోశాల వద్ద భక్తులకు పొంగళి అందిస్తున్న ఎస్ఎన్ఆర్ అధినేత బీవీ కృష్ణారెడ్డి, శ్రీనుబాబు



సింహపురిలేఅవుట్ ఆర్చ్ వద్దపులిహోర ప్రసాదం అందిస్తున్న సుజాతనగర్‌కు చెందిన నివాసితులు



జీవీఎంసీ ఆధ్వర్యంలో మంచినీరు అందజేత

భక్తులకు వైద్యసేవలు

అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పాత గోశాల నుంచి పాత అడవివరం మధ్య పలు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించారు. భక్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులిచ్చారు.

వేపగుంటలో ట్రాఫిక్ పద్మవ్యూహం



వేపగుంట కూడలి వద్ద బుధవారం సాయంత్రం పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్

- గంటల కొద్దీ నిలిచిపోయిన వాహనాలు
- గిరి ప్రదక్షిణ వేళ చేతులెత్తేసిన పోలీసులు



కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

పెందుర్తి: గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని చెప్పుకొచ్చిన ప్రభుత్వం సమయం వచ్చేసరికి మరోసారి కాడి వదిలేసింది. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ఆఖరి నిమిషంలో యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసింది. సింహగిరికి వెళ్లేందుకు ప్రధాన మార్గం అయిన వేపగుంట కూడలి బుధవారం సాయంత్రం పద్మవ్యూహాన్ని తలపించింది. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాధారణంగా ఉన్న భక్తుల రద్దీ ఆ తరువాత ఒక్కసారిగా పెరిగింది. విద్యార్థులు, ఉద్యోగులు వచ్చే సమయం కావడంతో వాహనాలు ఈ కూడలికి వేలాదిగా చేరుకున్నాయి. అయితే పోలీసులంతా సింహాచలం సమీపంలో విధుల్లో ఉండడంతో వేపగుంట కూడలి వద్ద ఉన్న కొద్దిపాటి సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించడంతో విఫలమయ్యారు. ఒక్కసారిగా వాహనాలు బారులు తీరాయి. కూడలి వద్ద నియంత్రణ అదుపు తప్పడంతో వాహనదారులు ఇష్టానుసారం వెళ్లడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులు సైతం దాదాపు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండిపోయారు. సాయంత్రం 5 నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఇక్కడ ఇదే పరిస్థితి కొనసాగింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులతో పాటు వాహనాల డ్రైవర్లు, స్థానికులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దాదాపు నెల రోజులుగా ట్రాఫిక్ నియంత్రణపై కసరత్తు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఆఖరి నిమిషంలో చేతులెత్తయడంపై వాహనదారులు తీవ్రంగా మండిపడ్డారు.

ముగిసిన శ్రీవిద్య ఉపాసన కోర్సు



శ్రీవిద్య ఉపాసనలో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో 7 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవిద్య ఉపాసన అడ్వాన్స్‌డ్ కోర్సు బుధవారంతో ముగిసింది. దేశంలోని ముంబై, పూణే, హైదరాబాద్, ఢిల్లీ వంటి ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, ఆస్ట్రేలియా, దుబాయ్, ఇటలీ, డెన్మార్క్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 24 మంది అభ్యాసకులు ఈ కోర్సులో శిక్షణ పొందారు. కోర్సులో భాగంగా దశ మహా విద్యలు, నవావరణ అర్చనలు, హోమ విధానాలు నేర్చుకున్నారని గురుమాత అన్నపూర్ణమ్మ వెల్లడించారు. గురుమాతతో పాటు ఆచార్యులు మూర్తి రాధ, కందర్ప రమలకు అభ్యాసకులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

దేవీపురంలో గురుపౌర్ణమి ఉత్సవాలను గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు చండీ సప్తశతి పారాయణం, సాయంత్రం హంసా మెడిటేషన్ నిర్వహించారు. గురువారం గోపూజ, అన్నపూర్ణమ్మ సహిత శ్రీఅమృతానంద సరస్వతి శిష్యులచే గురుమంత్ర హోమం జరుగుతుందన్నారు. సాయంత్రం గురుపాదుకా పల్లకీ ఊరేగింపు, గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కందర్ప ప్రభాకర్ పేర్కొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, సాయి సేవకులు



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతి ధామంలో సాయినాథుని రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్, సాయి సేవకులు ఆధ్వర్యంలో రథంపై బాబా ఉత్సవ మూర్తిని ఉంచి ఊరేగించారు. సమతానగర్, వుడా కాలనీ, వెంపళ్లనగర్, కొత్త కర్నవానిపాలెం, నడుపూరు మీదుగా రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలకు విఘాతం కలిగిస్తే సహించం

- దేశవ్యాప్త కార్మిక సమ్మెలో కార్మిక సంఘాల నేతలు



లంకెలపాలెం వద్ద దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న కార్మికులు



పరవాడలో అంగన్‌వాడీ కార్మికుల నిరసన ర్యాలీ



ఎన్టీపీసీ వద్ద సమ్మెలో పాల్గొన్న ఎన్టీపీసీ కార్మికులు

పరవాడ: కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు సిటు ఆధ్వర్యంలో లంకెలపాలెం, పరవాడ, ఎన్టీపీసీ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. లంకెలపాలెంలో సిటు జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలుచేసి ముఠా కార్మికుల సమగ్ర చట్టం చేయాలన్నారు. మోటారు కార్మికుల నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

- పరవాడ సబ్‌స్టేషన్ వద్ద స్కీం వర్కర్లు భారీ ఎత్తున రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.
- సింహాద్రి ఎన్టీపీసీ వద్ద సిటు, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ కార్మికులు సమ్మెలో పాల్గొని, రాస్తారోకో నిర్వహించారు. సిటు జిల్లా సహాయ కార్యదర్శి కె.బాలసూర్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, కార్మిక చట్టాల మార్పులను వ్యతిరేకించాలన్నారు. 8 గంటల పనిని 12 గంటలకు పెంచడాన్ని తప్పుపట్టారు. కార్యక్రమాల్లో సిటు నాయకులు బి.శ్రీనివాసరావు, పోతినాయుడు, రొంగలి అప్పారావు, సన్యాసిరావు, వెంకటరావు, వెంకటస్వామి, ఐఎన్‌టీయూసీ నాయకులు పి.పెంటారెడ్డి, వి.పి.నాయుడు, స్కీం వర్కర్ల యూనియన్ నాయకులు రత్నం, వరలక్ష్మి, విమల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం



పరమేశ్వరిని సత్కరిస్తున్న దానయ్య

ఉక్కునగరం: స్థానిక కల్పన ఫైన్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన దాచేపల్లి పరమేశ్వరికి జాతీయ స్థాయి బాల ప్రోత్సాహక పురస్కారం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని మామిడివాడకు చెందిన పరమేశ్వరి ఎనిమిదేళ్లుగా కల్పన ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతోంది. ఇటీవల విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో జరిగిన 12వ జాతీయ చిల్డ్రన్ అండ్ యూత్ ఎగ్జిబిషన్‌లో పరమేశ్వరి పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆమె ప్రతిభ చూపడంతో బాల ప్రోత్సాహ పురస్కారంతో పాటు వి.వి. భగీరథ అవార్డు, సర్టిఫికెట్, బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కల్పన ఫైన్ ఆర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు డి.దానయ్య పరమేశ్వరిని సత్కరించారు.

నేడు సింహగిరిపై ఢిల్లీ విజయం

- అప్పన్నకు తుదివిడత చందనం సమర్పణ నేడు



హంసమూలన కొలువైన భగవత్ రామానుజాచార్యులు

సింహాచలం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం ఢిల్లీ విజయం ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు వైదికులు ఏర్పాట్లు చేశారు. విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యులు తన పాండిత్యంతో ఢిల్లీ బాద్‌షాని మెప్పించిన రోజు ఆషాఢ పౌర్ణమి కావడంతో ఏటా ఆరోజు శ్రీ వైష్ణవ ఆలయాల్లో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ప్రముఖ శ్రీవైష్ణవ దేవాలయమైన సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆలయంలో హంసమూలకు ఒక విశిష్టత ఉంది. అక్కడ భగవత్ రామానుజాచార్యుల విగ్రహం ఉంది. అక్కడ ఆయన్ని వేంజేపచేసి సాయంత్రం 4 నుంచి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆయన వైభవాన్ని అర్చకులు కీర్తించి షోడషోపచార పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం తెల్లవారుజామున స్వామికి తుదివిడతగా మూడు మణుగుల పచ్చిచందనాన్ని సమర్పిస్తారు. ఇప్పటికే సిద్ధం చేసిన చందనంలో బుధవారం అర్చకులు సుగంధ ద్రవ్యాలు కలిపి సమర్పణకు అనువుగా సిద్ధం చేశారు.

పరిశోధనలతో దేశ అభివృద్ధి

మద్దిలపాలెం : దేశ అభివృద్ధికి సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధనలు ఎంతో దోహదపడతాయని ఆచార్య బి.వి.మురళీధర్ అన్నారు. ఏయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం ఆధ్వర్యంలో బుధవారం బహుళ విభాగాల పరిశోధనలో వినూత్న దిశలు అనే అంశంపై అతిథి ఉపాన్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మురళీధర్ ప్రసంగిస్తూ ప్రభుత్వాలు ఇలాంటి పరిశోధనలు జరిపించాలని సూచించారు. వీటికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సామాజిక శాస్త్రంతోపాటు అన్ని రంగాల్లో పరిశోధనలు జరిగితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు.

విమ్స్ కిటకిట



కన్సల్టెంట్స్ గదుల వద్ద రోగులు..



ఓపీ వద్ద రోగుల రద్దీ..

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) రోగులతో కిటకటలాడుతోంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల బారినపడుతున్న వారు విమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. వీరిలో కొద్ది రోజులుగా జ్వరాల బారిన పడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులుగా ఓపీ సుమారు 800 దాటుతోంది. జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ బాధితులు నమోదవుతున్నారు. సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నవారు ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్సలు పొందుతున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్, కార్డియాలజీ, ఈఎన్‌టీ తదితర వాటితో పాటు జ్వరాలతో వచ్చే రోగులతో రోజూ ఓపీ అధికంగా నమోదవుతోంది. జ్వరాలతో వెళ్లేవారికి రక్త పరీక్షలు నిర్వహించడంతో వారిలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు సోకినట్లు వెల్లడవుతోంది. అలాంటి వారు విమ్స్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. రోజూ విమ్స్‌కు వస్తున్న వారిలో 15 శాతంపైగా జ్వరాల బారిన పడినవారే ఉన్నారు.